నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 1 జూలై 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

**అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు**



ఎస్ఐ రాజబాబును సన్మానిస్తున్న అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 30 : ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, కుటుంబ సభ్యులతో హాయిగా గడపాలని అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు అన్నారు. ఆదివారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని డీపీవో కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐ రాజబాబుకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్ శంకర్ రెడ్డి, స్వామి తదితరులు ఉన్నారు.

## టీబీజీకేఎస్ బలోపేతానికి కృషి చేయాలి

- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు
- కేంద్ర కమిటీ నాయకులకు సన్మానం



టీబీజీకేఎస్ నూతన కమిటీ నాయకులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

శ్రీరాంపూర్, జూన్ 30 : టీబీజీకేఎస్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం శ్రీరాంపూర్‌లో టీబీజీకేఎస్ కేంద్ర కమిటీలో స్థానం పొందిన స్థానిక నాయకులను ఆయన శాలువాలతో సన్మానించారు. టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి నూతన కమిటీని నియమించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండి రమేశ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, రాష్ట్ర చీఫ్ ఆర్గనైజర్ పొగాకు రమేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పెండ్రి అన్వేష్‌రెడ్డి, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడి పెట్టం లక్ష్మణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోప్యా, రమేశ్, లాలా, స్వామిని సత్కరించి అభినందించారు.

# నీళ్ల చారు.. ఉడకని అన్నం

**ఆసిఫాబాద్ ప్రభుత్వ దవాఖానలో అధ్వానంగా భోజనం**

- ఉదయం పూట అల్పాహారం అసలే లేదు
- ఒక్కపూటా మెనూ పాటించకుండా మెక్కేస్తున్న కాంట్రాక్టర్
- మధ్యాహ్నం రుచి లేని బువ్వ
- ఇక రాత్రి పూట పెడితే పెట్టినట్లు.. లేకుంటే అంతే..
- పస్తులుంటున్న రోగులు.. పట్టించుకోని అధికారులు
- కేసీఆర్ సర్కారులో రూ.40 నుంచి రూ. 80కి పెరిగిన డైట్ చార్జీలు



దవాఖానలో రోగికి ఉడకని అన్నం పెట్టి.. నీళ్ల చారు పోస్తున్న మహిళ

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 30 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ సర్కారులో సకల సౌకర్యాలతో మెరుగైన వైద్యసేవలందించిన ప్రభుత్వ దవాఖానలు, ప్రస్తుతం నిర్వహణ లోపంతో అధ్వానంగా మారాయి. గతంలో మెనూ ప్రకారం రోగులకు నాణ్యమైన భోజనం అందగా, ఇప్పుడు రుచి లేకుండా పెడుతున్న ఆహారంతో పస్తులుండాల్సిన దుస్థితి దాపురించింది. ఆదివారం ఆసిఫాబాద్‌లోని ప్రభుత్వ దవాఖానను 'నమస్తే తెలంగాణ' సందర్శించగా, ప్రస్తుత పరిస్థితులకు అద్దం పట్టినట్లు కనిపించింది. 12 మంది పేషెంట్లుండగా, 10 మందికి మాత్రమే నీళ్లచారుతో ఉడకని అన్నం వడ్డించారు. ఇక మిగతా ఇద్దరికి భోజనం అయిపోయిందని చెప్పి వెళ్లిపోయా రు. మరి కొందరు ఉడకని అన్నాన్ని తినలేక బయటి నుంచి తెప్పించుకొని తినాల్సి వచ్చిం ది.

### రోగుల పస్తులు

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన రోగులకు మెనూ ప్రకారం భోజనం అందించకపోవడంతో పస్తులుండాల్సిన పరిస్థితి దాపురించింది. గత ప్రభుత్వం ప్రతి రోజూ ఉదయం పాలు, బ్రెడ్, టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం పెట్టగా, ప్రస్తుతం పట్టించుకునే నాథుడు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ఇక ఉదయం పూట అందించాల్సిన అల్పాహారం అసలే లేదు. మెనూ ప్రకారం పాలు, బ్రెడ్డు, కూరగాయల కూర, కోడిగుడ్డువంటివి అందించాల్సి ఉండగా, ఏ ఒక్కరోజూ ఇచ్చింది లేదు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య భోజనం పెడుతున్నా.. అదీ కూడా రుచి లేకుండా అధ్వానంగా ఉంటున్నది. నీళ్లచారు, ఉడకని అన్నం పెడుతుండగా, అడిగే దిక్కులేకుండా పోయింది.

### నీళ్ల చారు.. ఉడకని అన్నమే గతి

ప్రభుత్వ దవాఖానల్లో నాణ్యమైన భోజనం అందించేందుకు గత ప్రభుత్వం రోగుల డైట్ చార్జీలు రెట్టింపు చేసింది. అంతకుముందు ఒక్కో రోగికి రూ.40 డైట్‌చార్జి ఉంటే.. కేసీఆర్ ప్రభుత్వం 2022లో రూ. 80కి పెంచింది. పెరిగిన డైట్‌చార్జీల ప్రకారం కొంతకాలం మంచి భోజనం అందించిన కాంట్రాక్టర్లు.. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడిగే వారు లేకపోవడంతో అరకొరగా వడ్డిస్తూ అందినకాడికి దోచుకుంటున్నట్లు తెలుస్తున్నది. ఇక 12 గంటల ప్రాంతంలో నీళ్లచారు.. ఒకవేళ ఉంటే పలుచని పప్పు.. ఉడికీ.. ఉడకని అన్నం పెట్టి వెళ్లిపోతున్నారు. కాగా, ఈ విషయమై హాస్పిటల్ సిబ్బందిని ఫోన్‌లో వివరణ కోరేందుకు యత్నించగా అందుబాటులోకి రాలేదు.

### రోగులకు అందించాల్సినవి

- ఉదయం పాలు, బ్రెడ్డు అల్పాహారంగా ఇవ్వాలి.
- మధ్యాహ్న భోజనంలో కూరగాయలతో వండిన కూరతో పాటు, పప్పు, గుడ్డు లేదా అరటి పండు ఇవ్వాలి
- రాత్రి భోజనంలో ఏదేని కూరతోపాటు పప్పు, గుడ్డు లేదా అరటి పండు ఇవ్వాలి
- గర్భిణులతో పాటు వారి సహాయకులకూ భోజనం పెట్టాలి

### రోగులకు పెడుతున్నది ఇదీ

- ఉదయం అల్పాహారం అసలే లేదు
- మధ్యాహ్నం నీళ్లతో కూడిన చారు, ఉడకని అన్నం
- రాత్రి భోజనం పెడితే పెడతారు లేకపోతే లేదు. ఇకవేళ పెట్టినా నీళ్లచారు, ఉడకని అన్నమే.

### ఐదు రోజుల్లో ఒక్క పూటే బువ్వ పెట్టిన్రు

నేను దవాఖానలో చేరి ఐదు రోజులైతంది. ఇప్పటి దాకా ఒక్కపూట మాత్రమే బువ్వ పెట్టిన్రు. బుధవారం బెజ్జూర్ దవాఖానలో నార్మల్ డెలివరీ అయిన. బిడ్డ బరువు తక్కువగా ఉందని ఆసిఫాబాద్ దవాఖానకు పంపించిన్రు. గురువారం ఒక్కపూట మాత్రమే భోజనం పెట్టిన్రు. అదీ కూడా ఉడకని అన్నం. అది తింటే కడుపునొప్పి వస్తుందని తెలిసిన బంధువులు తీసుకొచ్చిన బువ్వ తింటున్న.

*- శైలజ, బాలింత, కొండపల్లి, బెజ్జూర్ మండలం*





### బయటి నుంచి తెచ్చుకుని తింటున్న

జరం రావడంతో ఆసిఫాబాద్ దవాఖానలో చేరిన. ఇక్కడ భోజనం సరిగా పెట్టడం లేదు. ఉడకని అన్నం, నీళ్ల చారుతో పెడుతున్నరు. అది తింటే రుచి లేదు. సప్పగా ఉంటుంది. అందుకే బయటి నుంచి తెచ్చుకుని తింటున్న. ఎక్కడెక్కడి నుంచో రోగులు వస్తరు. పేదోళ్లుంటరు. పైసల్లేనోళ్ల గతి ఎట్లా. ఇప్పటికైనా సర్కారు దవాఖానలో మంచి భోజనం పెట్టాలి.

*- దేవాజీ, బూరుగూడ, ఆసిఫాబాద్ మండలం*

# గనుల వేలంపై పోరుబాట

- సింగరేణి రక్షణకు కార్మిక సంఘాల యుద్ధభేరి
- నేటి నుంచే దశలవారీగా ఆందోళనలు
- ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ మినహా మెజార్టీ యూనియన్లు సై
- ఇప్పటికే టీబీజీకేఎస్, బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు
- 9న ఖనిలో మహాధర్నాకు కేటీఆర్ రాక



శ్రీరాంపూర్, జూన్ 30 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు బ్లాకులను వేలం వేసి.. ప్రైవేట్‌కు కట్టబెట్టే ప్రక్రియకు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో కార్మికలోకం పోరుబాట పడుతున్నది. గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటీయూసీ, మరో జాతీయ కార్మిక సంఘమైన ఐఎన్‌టీయూసీ ఇప్పటివరకు తమ వైఖరిని తెలియజేయకపోగా, మిగతా సంఘాలన్నీ ఉద్యమానికి సిద్ధమయ్యాయి. ఇప్పటికే స్పష్టమైన కార్యాచరణ ప్రకటించిన టీబీజీకేఎస్, బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. నేటి నుంచే గనులపై దశలవారీగా నిరసనలు చేపట్టనున్నాయి. బీజేపీకి అనుకూలంగా ఉన్న బీఎంఎస్ యూనియన్ మాత్రం గనుల వేలంలో పాల్గొనాలని కోరుతున్నది.

### నేటి నుంచే ఆందోళనలు

సింగరేణిని కాపాడుకునేందుకు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం పోరాటానికి సిద్ధమైంది. సోమవారం నుంచి సింగరేణి వ్యాప్తంగా దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు స్పష్టం చేశారు. 1న గనులపై నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేయడంతో పాటు గని అధికారులకు వినతిపత్రాలు అందజేస్తామని, 3న అన్ని ఏరియాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మల దహనం, 6న సింగరేణిలోని అన్ని జనరల్ మేనేజర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, జీఎంలకు వినతిపత్రాలు, 9న గోదావరిఖని పట్టణంలో మహాధర్నా ఉంటుందని, దీనికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాజరవుతారని వారు చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు, సింగరేణి కార్మికులు సైతం పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశమున్నట్లు తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగానే గనుల వేలం, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ఎంపీలకు అసెంబ్లీలో వినతి పత్రాలు అందించనున్నారు.

### అసెంబ్లీ, పార్లమెంట్ ముందు ధర్నాలకు సమాయత్తం

బీఆర్ఎస్, టీబీజీకేఎస్ కార్మికులకు పోరాటాలు కొత్తేమి కాదు. ప్రభుత్వాలు దిగిరాకపోతే అసెంబ్లీ, ఇందిరా పార్కు ముందు ధర్నా, నిరాహార దీక్షలు చేయడానికి టీబీజీకేఎస్, బీఆర్ఎస్ సిద్ధమవుతున్నది. కార్మికవర్గాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి పార్లమెంట్ ముట్టడి, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేసి కేంద్ర ప్రభుత్వానికి సింగరేణి గొప్పతనాన్ని చాటి చెప్పాలని నిర్ణయించింది.

### అన్ని సంఘాలతో కలిసి పోరాటం



కేసీఆర్ సర్కారులో గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాం. ఒక్క బొగ్గు పెల్లనూ కూడా తీయనివ్వలేదు. ఇప్పుడు మరోసారి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్టీలు, యూనియన్లతో కలిసి పోరాటాలు చేస్తాం. కేంద్ర ప్రభుత్వం కుట్రను తిప్పికొడుతాం. ఇప్పటికైనా గనుల వేలాన్ని రద్దు చేయాలి. లేదంటే రానున్న రోజుల్లో బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలకు పుట్టగతులుండవని గుర్తుంచుకోవాలి.

*- పెట్టం లక్ష్మణ్, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు, శ్రీరాంపూర్*

## డాక్టర్స్ డే శుభాకాంక్షలు
An ADVT Special Feature

# ఇక సెలవు..

**రాథోడ్ రమేశ్ అంతమయాత్రలో పాల్గొన్న భారీ జనం**



రాథోడ్ రమేశ్ అంతిమయాత్రలో పాల్గొన్న కార్యకర్తలు, ప్రజలు

ఉట్నూర్, జూన్ 30 : గిరిజన నాయకుడు, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అంతమయాత్రను ఆదివారం ఉట్నూర్ మండలంలోని నాగాపూర్ గ్రామ సమీపంలో నిర్వహించారు. గుండెపోటుతో బాధపడుతూ హైదరాబాద్‌కు తరలిస్తుండగా కన్నుమూసిన విషయం తెలిసిందే. అనంతరం మృతదేహాన్ని ఉట్నూర్‌లోని ఆయన నివాసానికి తరలించి ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఆదివారం చివరిచూపు చూసేందుకు జనం తండోపతండాలుగా వచ్చారు. అనంతరం ఆయన నివాసం నుంచి మండలంలోని నాగాపూర్ గ్రామం వద్ద ఉన్న ఆయన చేనులో ఖననం చేశారు. ఉట్నూర్ నుంచి సుమారు ఎనిమిది కిలోమీటర్ల మేర అంతిమయాత్రలో ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### నివాళులర్పించిన నాయకులు

మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అకాల మరణంతో కార్యకర్తలు, అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. మరణ వార్త తెలుసుకున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మెదక్ ఎంపీ ఈటెల రాజేందర్, ఎంపీ గోడం నగేశ్, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, బోథ్ ఎమ్మెల్యే అనీల్ జాదవ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే శంకర్, మాజీ మంత్రులు ఐకే రెడ్డి, వేణుగోపాలాచారి, మాజీ ఎమ్మెల్యే బాపూరావ్‌లు నివాళులు అర్పించారు. అలాగే ఉమ్మడి జిల్లాలోని బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చివరి చూపు కోసం బారులుదీరారు. అలాగే పట్టణంలో వ్యాపారులు సంపూర్ణంగా బంద్ నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.













## ఆసిఫాబాద్ జిల్లాలో మంత్రి సీతక్క పర్యటన



రిబ్బన్ కట్ చేసి కళాశాలను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

**పలుచోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు**



గంగాపూర్ కేజీబీవీలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

రెబ్బెన/ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్/కాగజ్‌నగర్/లింగాపూర్, జూన్ 30 : ఆసిఫాబాద్ జిల్లాలో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ (సీతక్క) ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. రెబ్బెన మండలం గంగాపూర్ శివారులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను కలెక్టర్ వెం కటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్‌తివారీ, దాసరి వేణు, డీఈ వో అశోక్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం నవేగాం, రె బ్బెన, ఖైర్‌గాం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానలను ప్రారంభించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, నియోజక వర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్, డీఎంహెచ్‌వో తుకారం, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్, జడ్పీటీసీ వేముర్ల సంతోశ్, ఎంపీపీ సౌందర్య, ఎంపీటీసీ హరిత, పెసరి మధునయ్య, తహసీల్దార్ జ్యోత్స్న, ఎంపీడీవో శంకరమ్మ, ఎంఈవో వెంకటేశ్వరస్వామి, డాక్టర్ సుజిత్, కేజీబీవీ ఎస్‌వో పద్మ, డీఈ అశోక్, ఏఈ కిరణ్, మాజీ జడ్పీటీసీ పల్లె ప్రకాశ్ రావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లావుడ్య రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజీ, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్‌గౌడ్, మాజీ సర్పంచ్ అహల్యాదేవి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కుందారపు శంకరమ్మ, నాయకులు ఆత్రం సుగుణ, కొవ్వూరి శ్రీనివాస్, చెన్న సోమశేఖర్, మోడెం చిరంజీవిగౌడ్, మోడెం రాజేంద్రప్రసాద్, లావుడ్య పల్లాస్, మైనార్టీ నాయకులు జహీర్‌బాబా, నాసీర్‌ఉస్మానీ ఉన్నారు.

**ఆసిఫాబాద్‌లో డైట్ కళాశాల**

జిల్లా కేంద్రంలో రూ. కోట్లతో నిర్మించిన డైట్ కళాశాలను మంత్రి సీతక్క.. కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ డైట్ కళాశాల ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలా చూస్తానన్నారు. డీఈవో అశోక్, పరీక్షల సహాయ సంచాలకుడు ఉదయబాబు, జిల్లా సైన్స్ అధికారి మధుకర్ పాల్గొన్నారు. కాగా, జిల్లా దవాఖానలో వైద్యులను నియమించాలని కోరుతూ సీపీఎం నాయకులు దినాకర్, రాజేందర్ మంత్రికి వినతి పత్రం ఇచ్చారు. లింగాపూర్ మండల కేంద్రంలో మంత్రి సీతక్క కేజీబీవీని ప్రారంభించారు. కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే తదితరులు పాల్గొన్నారు.

**పోడు రైతులకు అండగా ఉంటాం**

కాగజ్‌నగర్ పట్టణంలోని శ్రీరాంనగర్, కాపువాడ, నజ్రుల్‌నగర్‌లోని పల్లె దవాఖానలు, పట్టణంలోని మార్కెట్ కమిటీ ఆవరణలోని మిషన్ భగీరథ పథకాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పోడు భూముల సమస్య ఉందని, అడవులు కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కొత్తగా పోడు భూములు కొట్టకూడదని, సాగు చేసుకుంటున్న భూముల్లో వ్యవసాయం చేసుకోవాలని సూచించారు. పోడు రైతులకు అండగా ఉంటామని, పట్టాలు సైతం ఇస్తామని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్, డీఎఫ్‌వో, ఎఫ్‌డీవోలు సంయుక్తంగా సమావేశం ఏర్పాటు చేసి పోడు రైతుల సమస్య పరిష్కరించాలని సూచించారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు మాట్లాడుతూ గత పదేళ్లలో ఈ ప్రాంతంలో అభివృద్ధి జరుగలేదని, ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై మంత్రి సీతక్కకు వినతి పత్రాలు అందజేశారు. కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆర్డీవో సురేశ్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, డీఈ రమాదేవి, జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఎంపీపీ శంకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవయ్య పాల్గొన్నారు.




